క్లుప్తంగా

శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు



నగరంలో పలు ప్రాంతాల్లో ఊరేగింపు నిర్వహిస్తున్న సమితి సభ్యులు

బోట్‌క్లబ్: దేవుడే మనిషిగా అవతరించి, ఆ మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడని అంటామని, అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడని ప్రభోద సేవా సమితి అధ్యక్షుడు సలాది అనిల్‌కుమార్ అన్నారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జీఎన్‌యూకే వద్ద ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడి విగ్రహాన్ని మంగళవారం నగరంలో పలు ప్రాంతాల్లో ఊరేగించారు. శ్రీకృష్ణుడు పౌర్ణమి అమావాస్యలకు మధ్య అష్టమి తిథిలో పుట్టి జ్ఞాన అజ్ఞానాలకు వారధిగా ఉన్నారన్నారు. ఈ ఊరేగింపు నగరంలో పలు వీధులు గుండా నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



మంచి ముత్యాల అలంకరణలో ఉన్న ఆంజనేయస్వామి

బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామ స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆంజనేయస్వామికి శ్రావణ మంగళవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు పాణింగపల్లి మాధవాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి పంచామృతాభిషేకం చేసి, గంగ సింధూర పూజ, తమలపాకుల పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మంచిముత్యాలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

బోట్‌క్లబ్: శ్రావణ మాసం సందర్భంగా రాష్ట్రంలోని పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సు నడుపుతున్నట్టు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న కాకినాడ డిపో నుంచి సూపర్‌లగ్జరీ బస్సు శ్రీశైలం, మంత్రాలయం, అహోబిలం, మహానంది, యాగంటి, త్రిపురాంతకం, కోటప్పకొండ, విజయవాడ క్షేత్ర దర్శనం ఉంటుందన్నారు. ఈ బస్సుల ఈ నెల 25వ తేదీ రాత్రి 9 గంటలకు కాకినాడ డిపోకు చేరుతుందన్నారు. ఈ యాత్ర టిక్కెట్టు ధర రూ.3300 మాత్రమే అన్నారు. ఆసక్తి గల వారు 73829 10869 నంబర్‌లో సంప్రదించవచ్చునన్నారు.

మహా పురుషులు జన్మించిన పుణ్యభూమి



సనాతన ధర్మంపై ప్రసంగిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): మన సంస్కృతిలో ధర్మ, అర్థ, కామ, మోక్షాలకు ఎంతో ప్రాధాన్యం ఉందని సమన్వయ సరస్వతీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. స్థానిక సూర్య కళా మందిరంలో సరస్వతీ గాన సభ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సనాతన ధర్మ- శాశ్వత న్యాయం అనే అంశంపై రెండో రోజు ఆయన ప్రసంగించారు. మనది గొప్ప రుషి సంప్రదాయమన్నారు. అర్థ, కామాలను ధర్మ బద్ధంగా సంపాదించాలన్నారు. దాని కోసం జీవితాలను త్యాగం చేసిన మహా పురుషులు జన్మించిన పుణ్యభూమి ఇదని, మన సంతానానికి సంపూర్ణ ఆయురారోగ్యాలు, సత్ప్రవర్తన ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సరస్వతీ గాన గౌరవ అధ్యక్షురాలు పెద్దాడ సూర్య కుమారి పాల్గొన్నారు.

డ్రైన్‌లో పేరుకుపోయిన పూడిక



డ్రైనేజీలో పూడికను తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

కాకినాడ లీగల్: రెండు నెలల క్రితం చీడీలపార డ్రైనేజీలో పూడికను తొలగించారు. అయితే ఆ పూడికను పూర్తిగా తీయకపోవడంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి డ్రైనేజీ చెత్త పేరుకుపోయింది. ఈ డ్రైనేజీ అశోక్‌నగర్ నుంచి శారదాంబ గుడి, గాంధీనగర్, రామారావుపేట ప్రాంతాల మీదుగా ఇంద్రపాలెం ఉప్పుటేరు కాలువకు అనుసంధానంగా ఉంది. డ్రైనేజీలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పక్కన ఇళ్లలోని నివసిస్తు వారు ఇబ్బంది పడుతున్నారు.

ఎవరికీ పరీక్ష?

- ఉపాధ్యాయులకా.. విద్యార్థులకా..
- పాఠశాలలకు మూల్యాంకన పుస్తకాల పంపిణీ
- వాటిలోనే పరీక్షలు రాస్తున్న విద్యార్థులు
- సమయం సరిపోదంటున్న ఉపాధ్యాయులు

బాలాజీచెరువు: కూటమి ప్రభుత్వం అడ్డగోలు నిర్ణయాలు విద్యా రంగాన్ని అస్తవ్యస్తంగా మారుస్తున్నాయన్న వాదన వినిపిస్తోంది. ఇప్పటికే క్లస్టర్ విధానం, పాఠశాలల విలీనంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు గుర్రుగా ఉన్నారు. చాలా చోట్ల నిరసనలు కొనసాగుతున్నాయి. తాజాగా పరీక్షల్లో అసెస్‌మెంట్ పుస్తకాల విధానం అటు విద్యార్థులు, ఇటు గురువులను అయోమయానికి గుర్తిచేస్తోంది. మూల్యాంకన భారం గురువులపై పడుతుండగా, విద్యార్థులు గతంలో రాసిన సమాధానాలే మళ్లీ చూసిరాసేలా తెచ్చిన విధానంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఇంతకు ఈ పరీక్షలు ఉపాధ్యాయులకా లేకా విద్యార్థులకా అంటూ ఉపాధ్యాయ వర్గాలు ప్రభుత్వం తీరును దుయ్యబెడుతున్నాయి. గతంలో పరీక్షల సమయంలో కాగితాలపై జవాబులు రాస్తే ఉపాధ్యాయులు ఇంటికి తీసుకెళ్లేవారు. ఇప్పుడు మూల్యాంకన పుస్తకాలను విద్యార్థులకు అందించారు.

ఇదీ పరిస్థితి

కాకినాడ నగరంతో పాటు రూరల్ నియోజకవర్గంలో 135 పాఠశాలు ఉండగా, ఇందులో 32 వేల వరకూ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థి అభ్యసన సామర్థ్యం మదింపు కోసం ఏటా ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలను గత ఏడాది నుంచి సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్ 1, 2, 3, 4గా నిర్ణయించారు. 2025–26 విద్యా సంవత్సరంలో నాలుగు సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలు, రెండు సమ్మేటివ్ పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. మొదటి పరీక్ష ఈ నెల 11న నిర్వహించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జూన్ 12న పాఠశాలలు ప్రారంభమయ్యాయి. వాస్తవానికి ఈ పరీక్షలు ఈ నెల 4వ తేదీ నుంచి జరగాల్సి ఉంది. అసెస్‌మెంట్ బుక్‌లెట్స్ పాఠశాలలకు చేరుకోవడం ఆలస్యం కావడంతో సోమవారం నుంచి నిర్వహిస్తున్నారు. జూన్, జూలైల సిలబస్‌కు సంబంధించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై పరీక్షలు పెట్టారు.

ఏడాది మొత్తం ఇవే..

సర్కార్ బడుల్లో నిర్వహించే త్రైమాసిక అర్థ వార్షిక పరీక్షలను ఎఫ్–1, 2, 3, 4గా ఎస్‌ఏ–1, 2లుగా నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ పరీక్షలను విద్యార్థులు మూల్యాంకన పుస్తకాల్లో రాసేందుకు వీలుగా 1, 2 తరగతులకు మూడు పుస్తకాలు, 3, 4, 5 తరగతులకు నాలుగు పుస్తకాలు చొప్పున, 6, 7 తరగతులకు ఆరు పుస్తకాలు చొప్పున, 8, 9, 10 తరగతులకు ఏడు పుస్తకాల చొప్పున అందజేశారు. ఏడాదిలో జరిగే అన్ని పరీక్షల వివరాలను ఈ మూల్యాంకన పుస్తకంలో నమోదు చేసేందుకు ఏడాదంతా ఈ పుస్తకాన్ని ఉపాధ్యాయులు భద్రంగా ఉంచాలి. అయితే గతంలో తెలుపు కాగితాలపై పరీక్షలు రాస్తే ఇంటికి తీసుకెళ్లి మూల్యాంకనం చేసేవారు. మార్కుల నమోదుతో పని పూర్తయ్యేది. ఇప్పుడు మూల్యాంకన పుస్తకాలు ఇంటికి తీసుకెళ్లే అవకాశం లేదు. వీటిని భద్రపరచడం తలనొప్పిగా మారుతుందని, ఏకపక్షంగా కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో విద్యా వ్యవస్థ గాడి తప్పుతోందని విమర్శిస్తున్నారు.



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

> **పెరిగిన పని ఒత్తిడి**
>
> 
>
> ప్రభుత్వ పాఠశాలల్లో కొత్తగా తీసుకువచ్చిన మూల్యాంకన పుస్తక విధానంతో ఉపాధ్యాయులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఇప్పటికే బోధనేతర పనులతో సతమతమవుతున్న ఉపాధ్యాయులకు మూల్యాంకన పుస్తకాలు ఇచ్చి అదనపు భారం మోపుతున్నారు.
>
> –చింతాడ ప్రదీప్‌కుమార్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

వేంకటేశ్వరునికి జన్మ నక్షత్ర పూజలు



ఆలయంలో స్వామి వారి వ్రతాలు చేస్తున్న భక్తులు

కరప: యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం బహుళ ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని వేంకటేశ్వరస్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామాచార్యులు, వేదపండితులతో కలిసి పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారి వ్రతాలు ఆచరించారు. అనంతరం శాంతి కల్యాణం జరిపించారు. యండమూరు, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ



కరపలో పారిశుధ్య పనులను తనిఖీ చేసి, సూచనలిస్తున్న ఎంపీడీఓ అనుపమ

కరప: అంటువ్యాధులు వ్యాప్తి చెందకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎం.అనుపమ పేర్కొన్నారు. మండల కేంద్రమైన కరప గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించి, పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించి, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అనుపమ గ్రామస్తులను కలిసి పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణకు ప్రతిరోజూ ఇంటింటికీ వచ్చినప్పుడు తడి, పొడి చెత్త విడదీసి ఇవ్వాలన్నారు. పారిశుధ్య కార్మికులు చెత్తసేకరణకు ఇంటికి వస్తున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్ వస్తువులు వినియోగం వల్ల కలిగే అనర్థాలు వివరించి, వాటిని వినియోగించవద్దని ఆమె కోరారు. గ్రామ పంచాయతీ పనితీరుపై వచ్చే ఐవీఆర్‌ఎస్ ఫోన్ కాల్స్ గురించి వివరించి, ప్రశ్న అర్థం చేసుకుని సరైన సమాధానాలు ఇవ్వాలని ఎంపీడీఓ అనుపమ సూచించారు. తాగునీరు క్లోరినేషన్ ఎలా చేస్తున్నదీ పరిశీలించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు పాతర్లగడ్డ గ్రామంలో పర్యటించి, పారిశుధ్య పనులను తనిఖీ చేసి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. గ్రామ కార్యదర్శులు యు.నిర్మలాదేవి, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబుకు పితృవియోగం



తండ్రి భౌతిక కాయం వద్ద విలపిస్తున్న కురసాల కల్యాణ్ కృష్ణ

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ మంత్రి కురసాల కన్నబాబు ఇంట విషాదం అలముకుంది. ఆయన తండ్రి కురసాల సత్యనారాయణ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. తండ్రి భౌతిక కాయంపై కన్నబాబు, ఆయన సోదరుడు కల్యాణ్ కృష్ణ, కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు, బంధువులు కడ చూపును చూసి చలించిపోయారు.

కరప: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల, కాకినాడ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, సినీ డైరెక్టర్ కల్యాణకృష్ణ తండ్రి, పార్టీ సీనియన్ నాయకుడు కురసాల సత్యనారాయణ మంగళవారం మృతి చెందారు. కరప మండలంలోని పలువురు నాయకులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో కాకినాడ వెళ్లి కురసాల సత్యనారాయణ పార్థివ దేహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి కన్నబాబు, సినీ డైరెక్టర్ కల్యాణకృష్ణ, కుటుంబ సభ్యులను పరామర్శించి, సంతాపం తెలిపారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పబ్బినీడి పాపారావు, ఏక్టివ్ కార్యదర్శి కమిడి శంకర్, మండలయూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, అడబాల ప్రసాద్, చోడిశెట్టి చంటి, రెడ్డిపల్లి రమేష్, మామిడిపల్లి సంతోష్, తుమ్మలపల్లి చంద్రనగేష్, జల్దాని సతీష్, సర్పంచులు సాదే ఆశాజ్యోతి, కమిడి మంగాదేవి, వాసంశెట్టి రామారావు, నాగిరెడ్డి ఏసుబాబు, వెలుగుబంటి సీతారామరాఘవ, కరప మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు, ఎంపీటీసీలు కె.కామేశ్వరరావు, చెక్కపల్లి ఫకీర్రావు, మాజీ సర్పంచ్‌లు తదితరలు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

మాల వెల్ఫేర్ కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ విజయకుమార్

కాకినాడ సిటీ: ఎస్సీ యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనలకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.341 కోట్లు నిధులు కేటాయించిందని రాష్ట్ర మాల వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమార్ తెలిపారు. మంగళవారం కాకినాడ జిల్లాలో పర్యటించిన ఆయన ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతోను, ఎస్సీ మాల సంక్షేమ సంఘాలు, యువజన సంఘాలతో సమావేశమై తమ కార్పొరేషన్ ద్వారా చేపట్టాల్సిన కార్యాచరణలపై చర్చించారు. దీనిపై సూచనలు, సలహాలు స్వీకరించారు. అనంతరం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాల వెల్ఫేర్ కార్పొరేషన్ అమలు చేస్తున్న కార్యక్రమాలు, భావి ప్రణాళికలను వివరించారు. ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.341 కోట్లు నిధులు కేటాయించిందని వివరించారు. ఎస్సీ యువతకు నైపుణ్యాల శిక్షణ, అభివృద్ధి లక్ష్యంగా నాక్ సంస్థ ఆధ్వర్యంలో రూ.3 కోట్ల నిధులతో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను కార్పొరేషన్ నిర్వహిస్తోందన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఎస్సీ మాల యువత, పెద్దలతో నిర్వహించిన మీటింగ్ ద్వారా వారి అవసరాలు, ఆకాంక్షలను తెలుసుకున్నామన్నారు. వాటిని ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి అవసరమైన కార్యాచరణలు చేపడతామన్నారు. జిల్లాలోని వనరులు ఆధారంగా ఎస్సీ మాలల ఆర్థిక ప్రగతికి లోకలైజ్డ్ యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామని చైర్మన్ విజయకుమార్ తెలిపారు. రాష్ట్ర మాల వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లు దానం లాజర్ బాబు, కొల్లాబత్తుల అప్పారావు, చెల్లు అశోక్, మద్దా మణి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలతో దోమల నియంత్రణ



కొమరగిరిలోని మురికి నీటిలో గంబుషియా చేపలను వదులుతున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి: గంబూషియా చేపలను మురికి నీటిలో వదలడం వలన దోమలను నియంత్రించవచ్చునని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్ కుమార్ అన్నారు. కొమరగిరి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో ఉన్న కొమరగిరి, గోరస, కొండెవరం, చిన్న కలవలదొడ్డి, పెద్దకలవలదొడ్డిలో ఉన్న మురికి కాలవల్లో మంగళవారం గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చాపలను మురికి కాలువల్లో వదలడం వలన రోజుకు సుమారు 100 నుంచి 300 వరకు దోమల లార్వాను తింటుందన్నారు. డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వంటి వ్యాధులను వ్యాప్తి చేసే దోమల లార్వాను తిని వాటి జననాలను తగ్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



నురుకుర్తి సత్య నారాయణమ్మ(ఫైల్)

కరప: కోడలితో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లిన వివాహిత అదృశ్యంపై బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... కరప మండలం అరట్లకట్ట గ్రామానికి చెందిన నురుకుర్తి సత్యనారాయణమ్మ(50) ఈనెల 18వ తేదీన మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కోడలు హిమబిందుతో చిన్న గొడవ పడింది. ఆ తర్వాత సత్యనారాయణమ్మ ఎవ్వరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. అరట్లకట్ట పరిసర గ్రామాల్లో, స్నేహితులు, బంధువుల గృహాల్లో గాలించినా ఆమె ఆచూకీ తెలియలేదు. ఆమె పెద్ద కుమారుడు నురుకుర్తి శివశంకర్ మంగళవారం రాత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, కరప ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫొటోగ్రఫీతోనే జ్ఞాపకాలు పదిలం



రమణయ్యపేటలో ఫొటోగ్రాఫర్లకు సన్మానం

కాకినాడ రూరల్: అందమైన జ్ఞాపకాలను పదిలంగా పదేళ్ల పాటు ఉంచేది ఫొటోగ్రఫీ మాత్రమేనని సీనియర్ ఫొటోగ్రాఫర్ ఎస్వీ రెడ్డినాయుడు పేర్కొన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద ఫొటోగ్రాఫర్లు రెడ్డి నాయుడు, పిల్లి శ్రీరామ్మూర్తిలను ఘనంగా సత్కరించారు. 1839 ఆగస్టు 19న లూయిస్ డాగ్యురో తీసిన ఫొటోను ప్రజలకు పరిచయం చేయడంతో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం జరుపుకొంటున్నామని ఈ సందర్భంగా ఫొటోగ్రాఫర్లు పేర్కొన్నారు. ఫొటోగ్రఫీ ఒక అందమైన కళ అని ఇప్పుడు స్మార్ట్ ఫోన్లు వచ్చాక అందరూ ఫొటోగ్రాఫర్లుగా మారి తమలోని సృజనాత్మకతను చాటుతున్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతకాయల సుబ్బారావు, ప్రసాద్ నాయుడు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, ధర్మచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యలో వేడుక

బాలాజీచెరువు: ఆదిత్య మహిళ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏడాది ఆగస్టు 19న నిర్వహించుకునే ఫొటోగ్రఫీడే నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కరుణ,వైస్‌ప్రిన్సిపాల్ నాగ శ్రీకాంత్,విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కార్పెంటర్స్ డే

200 మంది కార్పెంటర్లకు సత్కారం



కార్పెంటర్లను సత్కరిస్తున్న దృశ్యం

బాలాజీచెరువు: కార్పెంటర్స్ డే వారోత్సవాల్లో భాగంగా ప్రముఖ హెచ్‌డీఎంఆర్ కంపెనీ యాక్షన్ టైసా సంస్థ జిల్లాలోని పలువురు కార్పెంటర్లను ఘనంగా సత్కరించింది. కాకినాడలో ఒక హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ డాక్టర్ వై.జనార్దనరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వడ్రంగి కళ అనేది కనుమరుగైపోతోందన్నారు. ఈ కళను బతికించుకోవాలంటే వడ్రంగి కళాకారులు ఆధునికత వైపు అడుగులు వేయాలని సూచించారు. ప్రస్తుత కాలంలో అధునాతన పనిముట్లతో పాటుగా అధునాతనమైన మెటీరియల్స్‌తో చక్కగా తీర్చిదిద్దిన మెటీరియల్ సైతం మార్కెట్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని సద్వినియోగపరచుకుని వినియోగదారులకు చేరువ చేసి సత్ఫలితాలను పొందాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన 200 మందికి పైగా కార్పెంటర్లకు 'టైసా సలామ్' అనే నినాదంతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఆథరైజ్డ్ డిస్ట్రిబ్యూటర్ అనుకుల అల్యూమినియమ్స్ ప్రొప్రైటర్ అనుకుల గాంధీ, సంస్థ స్థానిక ఎగ్జిక్యూటివ్ బొందల సంతోష, జిల్లాకు చెందిన కార్పెంటర్ల యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం



రక్తదానం చేస్తున్న యువకులు

కాకినాడ క్రైం: నగరంలోని గ్లాస్ హౌస్ సెంటర్‌లో ఉన్న యువసేన బ్లడ్ బ్యాంక్‌లో 90 మంది యువకులు రక్తదానం చేశారు. మొగలి తేజ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో రాజ్యసభ ఎంపీ సానా సతీషబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాతలను శ్రీయువసేన వ్యవస్థాపకుడు డాక్టర్ బొల్లం సతీష్ అభినందించారు. కార్యక్రమంలో కరప డీజీ పీజీ సత్యనారాయణ పేద విద్యార్థుల చదువు కోసం రూ.10 వేలు యువసేన స్వచ్ఛంద సంస్థకు విరాళంగా ఇచ్చారు.

ట్రాఫిక్ ఎస్సైను ఆదర్శంగా తీసుకోవాలి

సామర్లకోట: స్థానిక ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావును ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా మానవ హక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ అన్నారు. ట్రాఫిక్ ఎస్సై చేస్తున్న సేవలను గుర్తించి మంగళవారం స్థానిక పోలీసు అవుట్ పోస్టులో మానవహక్కుల సంఘం ఆధ్వర్యంలో గరగారావును సత్కరించారు. నిత్యం రద్దీగా ఉండే బస్సు కాంప్లెక్స్‌లోను, రైల్వే స్టేషన్ ఆవరణలోను ప్రతి రోజు దొంగతనాలు జరిగేవని అయితే ముఖ్యకూడలి ప్రదేశాలతో పాటు షాపుల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి, దొంగలపై నిఘా పెట్టారని, ప్రయాణికులను అప్రమత్తం చేస్తూ మైక్ సెట్ ఏర్పాటు చేయించారన్నారు. తప్పిపోయిన చిన్నారులను గుర్తించడంతో పాటు, తన వంతు బాధ్యతగా రోడ్డుపై ఉన్న గోతులను పూడ్చించారని తెలిపారు. సోమవారం ఒక మహిళ ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నం చేయగా వెంటనే గుర్తించి పోలీసు స్టేషన్‌కు తరలించడంతో జిల్లా ఎస్పీ నుంచి కూడా అభినందనలు అందుకున్నారని అప్పలకొండ తెలిపారు. అటువంటి వ్యక్తిని సత్కరించడం తమ బాధ్యతగా భావించామన్నారు. ఈ కార్యక్రమంలో మానవహక్కుల సంఘ నాయకులు అల్లాకి శ్రీనివాసరావు, జుత్తుక అప్పారావు, కుంచే నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంకా తగ్గని ఉద్ధృతి

- కొనసాగుతున్న సుద్దగడ్డ వరద
- నీటిలోనే పంట పొలాలు, కాలనీలు
- కొత్త కాలనీకి తప్పని ఇబ్బందులు



గొల్లప్రోలులో నీట మునిగిన పంట పొలాలు

పిఠాపురం: గొల్లప్రోలు మండలంలో సుద్దగడ్డకు వచ్చిన వరద ఉధృతి నాలుగో రోజు కొనసాగింది. వరద ఉధృతి తగ్గకపోవడంతో పాటు పెరుగుతుండడంతో లోతట్టు కాలనీలు పంట పొలాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. గొల్లప్రోలు కొత్త కాలనీ వద్ద సుద్దగడ్డ కాలువ నీటి ఉధృతి కొనసాగుతుండడంతో రాకపోకలు నిలిచిపోయి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువపై కట్టిన వంతెన పూర్తి కాకపోవడంతో నిచ్చెనలపై ప్రమాదకర పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికి వరద ఉధృతి మాత్రం కొనసాగుతోంది. ఇది తగ్గడానికి మరో రెండు రోజులు పట్టే అవకాశం ఉన్నట్టుగా అధికారులు చెబుతున్నారు. గొల్లప్రోలు మండలాల్లో ఏలేరు, సుద్దగడ్డ తదితర ప్రధాన పంట కాలువలు పొంగి పొర్లుతుండడంతో పంట పొలాలు నీట మునిగాయి. పిఠాపురం మండలంలో పి.తిమ్మాపురం, జములపల్లి, రాయవరం, రాపర్తి, గొల్లప్రోలు మండలంలో లక్ష్మీపురం, చేబ్రోలు, సీతానగరం తదితర గ్రామాల్లో వరి పంట సుమారు 800 ఎకరాల్లో పీట మునగగా, సుమారు 170 ఎకరాల్లో పత్తి పంట నీట మునిగాయి. ఇతర వాణిజ్య పంటలు దెబ్బతింటున్నాయి. ముఖ్యంగా వెదజల్లే పద్ధతిలో వేసిన వరి పంట పూర్తిగా నీట మునుగుతోంది. సుద్దగడ్డ కాలువ పొంగి ప్రవహిస్తుండడంతో గొల్లప్రోలు ఈబీసీ కాలనీ, కొత్త కాలనీ, సూరంపేట, అరుంధతీయపేట తదితర నివాస ప్రాంతాలు నీట మునిగి స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.



గొల్లప్రోలులో నీట మునిగిన వాణిజ్య పంట పొలాలు



చెరువుగా మారిన గొల్లప్రోలు అరుంధతీయపేట కాలనీ



గొల్లప్రోలు కొత్త కాలనీ వాసుల ఇక్కట్లు